క్లుప్తంగా...

10నుంచి శ్రీలక్ష్మీ సుదర్శన మహాయజ్ఞం



అల్వాల్: అల్వాల్‌లోని శ్రీబాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వచ్చేనెల 10వ తేదీ నుంచి శ్రీలక్ష్మీ సుదర్శన మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. శనివారం సుదర్శన మహాయజ్ఞం కరపత్రాలను ఆలయ ఫౌండర్ చైర్మన్ రాజా సంజయ్ గోపాల్ సైంచర్, ఆలయ కార్యనిర్వహణ అధికారి వి.నరేందర్ ఆవిష్కరించారు. మూడు రోజుల పాటు మహాయజ్ఞం కొనసాగుతుందన్నారు.

అల్వాల్ సర్కిల్ ఉపకమిషనర్‌గా శ్రీనివాస్‌రెడ్డి



అల్వాల్: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అల్వాల్ సర్కిల్ ఉపకమిషనర్‌గా వి.శ్రీనివాస్‌రెడ్డి శనివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. సచివాలయంలో న్యాయ విభాగంలో పనిచేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి మొదటిసారిగా జీహెచ్‌ఎంసీలో ఉపకమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. అల్వాల్‌లో పనిచేసిన నాగమణి కుత్బుల్లాపూర్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. అల్వాల్ సర్కిల్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని ఆయన అన్నారు. సర్కిల్ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

మత్స్యావతారంలో మహా విష్ణువు



మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీవేంకటేశ్వర దేవస్థానంలో శనివారం ఏకాదశి తిథి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాలకడలిలో శ్రీమహా విష్ణువు మత్స్యావతారం అలంకరణలో మూలవిరాట్‌ను అలంకరించి పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు ముడుంబై వేంకటరమణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచేందుకు..

మల్కాజిగిరి: అక్షర కౌముది సాహిత్య సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సినారె, దాశరథిల జయంతి సందర్భంగా ఆన్‌లైన్ ద్వారా చేపట్టిన సాహిత్య సప్తాహ కార్యక్రమం శనివారం ముగిసింది. మాజీ లెఫ్టినెంట్ కల్నల్ భిక్షపతి మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని అన్నారు. సంస్థ అధ్యక్షుడు తులసి రమణాచార్యులు, కవయిత్రి సునంద, నాళేశ్వరం శంకరం, డా. పోరెడ్డి రంగయ్య, లింగారెడ్డి, డాక్టర్ దాసోజు పద్మావతి, మూర్తి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి



బోడుప్పల్: బోడుప్పల్‌కు చెందిన రాపోలు రామస్వామి అనారోగ్యానికి గురి కావడంతో ఆయనకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.లక్ష చెక్కును శనివారం మేయర్ సామల బుచ్చిరెడ్డి, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని, వాటిని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చీరాల నర్సింహ, బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, నాయకులు కొత్త చక్రపాణిగౌడ్, కాటపల్లి రాంచంద్రారెడ్డి, మీసాల యాదగిరి, రాసాల మహేష్‌యాదవ్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



మల్లాపూర్: మల్లాపూర్ జనప్రియ టౌన్‌షిప్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చంద్రశేఖర్‌రావు, ప్రధాన కార్యదర్శి ఆంటోని, సలహాదారులుగా ఉమా మహేశ్వర్‌రావు కమిటీ ప్రతినిధులుగా ఎంఎస్ మూర్తి, సత్యప్రసాద్, సీహెచ్.శ్రీనివాస్ ఎన్నికయ్యారు. అనంతరం మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డిని నూతన కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని కార్పొరేటర్ వార్డు కార్యాలయంలో ఘనంగా సత్కరించారు.

మూడు నెలల్లో కేసీఆర్ పాలనకు చరమగీతం

- రాష్ట్రంలో ప్రజలు వరదలో మునిగితే.. కేసీఆర్ పార్టీ కండువాలు కప్పుతున్నారు
- ఉప్పల్ రహదారి దుస్థితి పట్టదా..?
- రాష్ట్ర ప్రభుత్వానికి పిండ ప్రదానం చేస్తాం
- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి



ఉప్పల్‌లో పాదయాత్ర చేస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు

రామంతాపూర్: రాష్ట్రమంతా భారీ వర్షంతో వరదల్లో ప్రజలు మునిగి ఆస్తులు, ప్రాణాలు పోగొట్టుకుంటే ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రం అవేమీ పట్టించుకోకుండా పార్టీ ఫిరాయింపులపై దృష్టి సారించి పార్టీలో చేరుతున్న వారికి నవ్వుతూ కండువాలు కప్పుతున్నారని టీపీసీసీ అధ్యక్షులు ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. ఉప్పల్ ప్రధాన రహదారిలో గుంతలతో అస్తవ్యస్తంగా మారిన రోడ్డును సీనియర్ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పల్ నుంచి నారపల్లి వరకు నిర్మిస్తున్న కారిడార్ పనులను సకాలంలో పూర్తి చేయకపోవడమే కాకుండా గుంతలు ఏర్పడి బురదతో నిండిన ప్రధాన రహదారిని పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలోని వరద బాధితులను పట్టించుకోని ఈ రాష్ట్ర ప్రభుత్వానికి సోమవారం పిండ ప్రదానం చేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అని తెలిపారు. బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలు కుమ్మక్కై రాజకీయాలు చేస్తున్నాయని, మూడు నెలల్లోనే కేసీఆర్ పాలనకు చరమగీతం పాడి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలు వరద సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. ఉప్పల్ కారిడార్ పనులు, గుంతల రోడ్ల గురించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో వచ్చిన వరదలపై త్వరలో కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని, తక్షణ సహాయం కింద రూ.వెయ్యి కోట్లు మంజూరయ్యే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు.

ఎంపీ పర్యటనను అధికారులు పట్టించుకోరా..?

ఉప్పల్ పర్యటనకు వచ్చిన రేవంత్‌రెడ్డి రోడ్ల పరిశీలన కార్యక్రమంలో అధికారులు ఎవరూ పాల్గొనకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక ఎంపీ పర్యటనకు వస్తే అధికారులు రారా అంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే ఉప్పల్ కారిడార్ పనులపై సమగ్ర నివేదిక అందించాలని ఆయన అధికారులను డిమాండ్ చేశారు. పలువురు సీనియర్ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

- రికార్డుస్థాయిలో సంక్షేమ కార్యక్రమాలు
- ఎస్‌ఎన్‌డీపీ నాలాతో ముంపునకు చెక్
- పాదయాత్రలో ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి

రామంతాపూర్: ఉప్పల్ నియోజకవర్గంలో సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తాను ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి రాజకీయాలకు తావు లేకుండా కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. మీ కోసం ఎమ్మెల్యే పాదయాత్రలో భాగంగా 18వ రోజు శనివారం రామంతాపూర్ పరిధిలోని కేసీఆర్‌నగర్ జనప్రియ అపార్టుమెంట్స్ గాంధీనగర్, అరవింద్ నగర్, శ్రీరామకాలనీ తదితర బస్తీలు, కాలనీల్లో ప్రజల సమస్యలు తెలుసుకుంటూ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. సమస్యలను వారం రోజుల్లోగా పరిష్కరించేలా కృషి చేస్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి వర్షాకాలంలో రామంతాపూర్‌లోని పెద్ద చెరువు నుంచి వచ్చే వరదల నివారణకు రూ.10 కోట్లతో నిర్మించిన ఎస్‌ఎన్‌డీపీ నాలా పనులను తక్కువ కాలంలోనే పూర్తిచేసి వరదల బాధ లేకుండా చేశామన్నారు. స్థానిక సంక్షేమ సంఘాల నేతలతో పాటు టీఆర్‌ఎస్ నేతలు జనంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గడ్డం రవికుమార్, గరికె సుధాకర్, మహ్మద్ ముస్తాక్, సంపత్, నరేష్ పాల్గొన్నారు.



పాదయాత్రలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

ఉచితంగా మొక్కలు, పక్షిగూళ్ల పంపిణీ

కాప్రా: పర్యావరణ, పక్షుల ప్రేమికుడు నంబూరి కృష్ణంరాజు ఆదివారం ఉచితంగా మొక్కలు, పక్షిగూళ్లు పంపిణీ చేయనున్నారు. సొంత ఖర్చులతో మొక్కలు పెంచి, పక్షిగూళ్లు తయారు చేయించి ఉచితంగా పంపిణీ చేస్తుంటాడు. మారేడు, ఉసిరి, నేరేడు, పనస వంటి మొదలైన పండ్ల మొక్కలతో పాటు పక్షిగూళ్లను కూడా ఉచితంగా పంపిణీ చేస్తానని తెలిపారు. కాప్రా హైటెన్షన్ లైన్ ఈశ్వరిపురి కాలనీలో తన నివాసం వద్దకు వచ్చి తీసుకోవాలని తెలిపారు. ఫోన్: 99891 83004.



ఓల్డ్ నేరెడ్‌మెట్ ప్రార్థనల్లో ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు



హెచ్‌బీకాలనీలో నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్

త్యాగాలకు ప్రతీక మొహర్రం

త్యాగానికి ప్రతీక అయిన మొహర్రంను శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పలువురు మొక్కులు చెల్లించుకున్నారు. పీర్లకు దట్టీలు సమర్పించి ఊరేగించారు. కులమతాలకు అతీతంగా ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అసైదులా ఆటలు ఆడారు.



హెచ్‌బీకాలనీలో ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి



ఓల్డ్ నేరెడ్‌మెట్ ప్రార్థనల్లో కార్పొరేటర్ శ్రవణ్



ఏఎస్‌రావునగర్‌లో ఖాజాపాషా కుటుంబ సభ్యులతో బండారి లక్ష్మారెడ్డి

అందరి భాగస్వామ్యంతో సుందరమైన ఆలయం



విరాళాన్ని అందజేస్తున్న కార్పొరేటర్ పద్మారెడ్డి

బోడుప్పల్: ఆలయ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి పిలుపునిచ్చారు. బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని దాసాంజనేయ దేవాలయం పునర్నిర్మాణం కోసం పలువురు కార్పొరేటర్లు విరాళాలు అందజేశారు. చీరాల నర్సింహ రూ.2,01,116 లక్షలు, జనిగే మహేందర్‌యాదవ్ రూ.2,01,116, కాటపల్లి లతా రాంచంద్రారెడ్డి రూ.2,01,116, సింగిరెడ్డి పద్మారెడ్డి రూ.2,01,116, బొమ్మక్ సుగుణ బాలయ్య రూ.2,01,116, గుర్రాల రమా వెంకటేశ్‌యాదవ్ రూ.2,01,116, పులకండ్ల హేమలతా జంగారెడ్డి రూ.2,01,116, సామల పవన్‌రెడ్డి రూ.2,01,116, కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి రూ.1,01,116, బింగి జంగయ్యయాదవ్ రూ.1,01,116లను విరాళంగా అందజేసినట్లు వారు వెల్లడించారు. బోడుప్పల్ నగర ప్రజల అభీష్టం మేరకు సుందరమైన ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు వెల్లడించారు.

నిరుపేద కుటుంబానికి చేయూత

మల్లాపూర్: భారీ వర్షానికి నాచారం ఎర్రకుంటలో జవాజి వెంకటేష్ ఇల్లు కూలిపోయింది. విషయం తెలుసుకున్న బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి శనివారం వెంకటేష్ కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చి రూ.20 వేలను అందజేశారు.

వెంటనే సమస్యలకు పరిష్కారం

మల్కాజిగిరి: ఎస్పీనగర్‌లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ అధికారులను ఆదేశించారు. కొన్ని విద్యుత్ పోల్స్ దెబ్బతిన్నాయని, కొన్ని రోడ్డుకు అడ్డంగా ఉన్నాయని కార్పొరేటర్‌కు స్థానికులు తెలిపారు. మ్యాన్‌హోల్స్ దెబ్బతిన్నాయని చెప్పారు. వెంటనే స్పందించాలని విద్యుత్ విభాగం ఏఈ సు. దీప్‌రెడ్డి, జలమండలి డీజీఎం అశ్రిత, హార్టికల్చర్ అధికారి రాజుకు సూచించామన్నారు.

ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్‌లో..

వెంకటేశ్వరనగర్‌లో కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ పర్యటించారు. కొన్ని సమస్యలను కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. తగిన చర్యలు తీసుకుంటామని కాలనీవాసులకు ఆయన హామీ ఇచ్చారు. సత్యమూర్తి, వెంకట్, సత్యనారాయణ, సంపత్, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.



వెంకటేశ్వరనగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ ప్రేమకుమార్



ఎస్పీనగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

బీజేపీ నీచరాజకీయాలు మానుకోవాలి




మాట్లాడుతున్న కార్పొరేటర్లు, నాయకులు

మేడిపల్లి: ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసం బీజేపీ నాయకులు నీచరాజకీయాలకు పాల్పడుతున్నారని, బీఆర్‌ఎస్ నాయకులు, కార్పొరేటర్లు అన్నారు. ఈ సందర్భంగా శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే దాడులకు పాల్పడుతున్నారని అన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కార్పొరేషన్ పరిధిలో 16వ డివిజన్‌లో పలు కాలనీల్లో వరద పేరుతో పర్యటించిన బీజేపీ నాయకులు కొందరు అభివృద్ధి పనులను ధ్వంసం చేసేందుకు ప్రయత్నిస్తుండగా అడ్డుకున్న స్థానిక కార్పొరేటర్ రమ్యసతీష్‌గౌడ్, నాయకులు రఘువర్ధన్‌రెడ్డిపై శుక్రవారం దాడికి పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో శనివారం పీర్జాదిగూడలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో కార్పొరేటర్లు, నాయకులు విలేకరులతో మాట్లాడారు. వరదల పేరుతో వచ్చిన బీజేపీ నాయకులు వీధి రౌడీల్లా ప్రవర్తించారని అన్నారు. బీజేపీ నాయకులపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. కార్పొరేటర్లు సుభాష్‌నాయక్, దొంతిరి హరిశంకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కొడె పోచయ్య, ఎంపాల అనంతరెడ్డి, బండి రమ్యసతీష్‌గౌడ్, నాయకులు బండారి రవీందర్, రఘుపతిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, జావిద్‌ఖాన్, మనోరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్ హబ్‌గా హైదరాబాద్

మల్లాపూర్: సినీ పరిశ్రమలో యానిమేషన్ రంగంలో విజువల్ ఎఫెక్ట్స్ హబ్‌గా హైదరాబాద్ ఎంతో అభివృద్ధి చెందిందని తెలంగాణ ఐటీ, ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ అన్నారు. శనివారం మల్లాపూర్ వీఎస్‌ఆర్ గార్డెన్‌లో వీఎఫ్‌ఎక్స్ కంపెనీ రోటోమేకర్ 15వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జయేష్ రంజన్ మాట్లాడుతూ.. గతంలో యానిమేషన్‌లో బెంగళూరు ముందంజలో ఉండేది, ప్రస్తుతం యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్‌లో సృజనాత్మకతలో నగరం ముందంజలో ఉందన్నారు. రాబోయే రోజుల్లో సినీ, పరిశ్రమ రంగం, డిజిటల్ ఎంటర్‌టైన్మెంట్‌లో యానిమేషన్ కీలకం కానుందన్నారు. హుజూర్‌నగర్ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, రోటోమేకర్, వ్యవస్థాపకుడు సీఈవో మాధవరెడ్డి, టెక్నికల్ కంట్రీ హెడ్ బిరెన్ ఘోష్, తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బసిరెడ్డి, గ్రీన్ గోల్డ్ యానిమేషన్స్ వ్యవస్థాపకుడు రాజీవ్ చిలక తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్